
వారధి నిర్మాణం జరిగేనా?

- పోలవరం కుడి కాలువపై 15 ఏళ్లుగా పూర్తికాని వైనం
- రెండు గ్రామాల ప్రజలకు అవస్థలు
- రాజకీయ పార్టీలకు ఎన్నికల హామీ


దేవరపల్లి-లక్ష్మీపురం గ్రామాల మధ్య పోలవరం కుడి కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన

దేవరపల్లి: పోలవరం కుడి ప్రధాన కాలువపై వంతెన నిర్మాణం రెండు గ్రామాల ప్రజల కలగా మిగిలింది. దాదాపు 15 ఏళ్లుగా వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో దేవరపల్లి, లక్ష్మీపురం గ్రామాల మధ్య రాకపోకలు తెగిపోయాయి. ఈ రెండు గ్రామాల మధ్య దేవరపల్లి సమీపంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ, పోలవరం కుడి ప్రధాన కాలువ నిర్మించారు. 2004-06 మధ్య కాలంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ నిర్మించారు. దీనిపై 2007-2008లో వంతెన నిర్మించారు. అప్పటికి పోలవరం కుడి ప్రధాన కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. 2015-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పోలవరం కుడి ప్రధాన కాలువ పనులు చేపట్టి సుమారు మూడు కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసి కాలువకు గోదావరి నీటిని విడుదల చేశారు. అప్పట్లో కాలువ పనులు పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి రైతులు కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం గురించి వివరించారు. వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని చంద్రబాబు రైతులకు, రెండు గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. కాలువ పనులు పూర్తి చేసిన అధికారులు వంతె నిర్మాణం గురించి పట్టించుకోలేదు. వంతె నిర్మాణం తమ ప్యాకేజీలో లేదని కాంట్రాక్టర్ వివరించారు. పలువురు రైతులు అప్పటి జలవనరుల శాఖా మంత్రిని కలిసి సమస్యను వివరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

అవస్థలు పడుతున్న ప్రజలు

వంతె నిర్మించక పోవడంతో రెండు గ్రామాల ప్రజలు, రైతులు గత 15 ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి లక్ష్మీపురం గ్రామ ప్రజలు రావాలంటే వంతెన సదుపాయం లేకపోవడంతో నానావస్థలూ పడుతున్నారు. రెండు గ్రామాల మధ్య పంట పొలాలు ఎక్కువగా ఉండడంతో రైతులు తమ వ్యవసాయయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి రవాణా సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు.

ఎన్నికల హామీగా వంతెన నిర్మాణం

గత మూడు పర్యాయాలుగా వంతెన నిర్మాణం రాజకీయ పార్టీలకు ఎన్నికల హామీగా మారింది. ప్రతి ఎన్నికల్లో రాజకీయ నాయకులను రెండు గ్రామాల ప్రజలూ వంతెన నిర్మాణం గురించి ప్రశ్నించడం, నెగ్గిన తర్వాత ముందుగా వంతెన నిర్మిస్తామని హామీ ఇవ్వడం, అనంతరం పట్టించుకోక పోవడం పరిపాటిగా మారింది. దీంతో వంతెన నిర్మాణం పూర్తవుతుందా? లేదా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

వంతెన సమస్యను 2022లో అప్పటి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతిపాదనలు తయారు చేసి జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. 2023లో వంతె నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు టెండర్లు కూడా పిలిచారు. టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

వంతెన లేక ఇబ్బంది పడుతున్నాం



పోలవరం కుడి ప్రధాన కాలువపై సుమారు 15 ఏళ్లుగా వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గ్రామం నుంచి దేవరపల్లి వెళ్లాలంటే సుమారు 4 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళుతున్నాం. ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. వంతెన నిర్మిస్తే రెండు గ్రామాల ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇటీవల గ్రామానికి వచ్చిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు వంతెన సమస్యను వివరించాం. సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

– మెంటెం సురేష్, లక్ష్మీపురం

నిధుల మంజూరు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృషి వల్ల ఈ వంతెనకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 2022లో రూ.4 కోట్లు మంజూరు కాగా, టెండర్లు వేయక పోవడంతో దీనిని రూ. 4.50 కోట్లకు అంచనా వ్యయం పెంచి నిధులు మంజూరు చేశారు. వంతె నిర్మాణం అసంపూర్తిగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరై ఉన్నందున ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలి.

– సాదే సుబ్బారావు, వైస్ ఎంపీపీ, లక్ష్మీపురం

క్లుప్తంగా

న్యూ లైఫ్ స్కూల్‌ను సందర్శించిన ఎంఈఓలు


న్యూలైఫ్ స్కూల్‌ను సందర్శించిన ఎంఈఓలు సత్యనారాయణ, భగవతి

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల గాంధీ కాలనీలోని న్యూ లైఫ్ స్కూల్‌ను మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, భగవతి సోమవారం సందర్శించారు. ఈ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి సూచన మేరకు ఆ స్కూల్‌ను ఇద్దరు ఎంఈఓలూ పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్టు వారు వివరించారు. వంటగది, టాయ్‌లెట్లు ,తాగునీరు, స్కూల్ రికార్డులు, తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ ఎంఈఓలతో ఉన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.2.54 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి హుండీలను సోమవారం అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా 32 రోజులకు రూ.2.54 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ వెల్లడించారు. అలాగే అన్నదాన హుండీ ద్వారా అదనంగా రూ.5,073 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ తనిఖీదారు జి.సత్యప్రసాద్ సమక్షంలో నిర్వహించిన హుండీల లెక్కింపులో అన్నవరప్పాడు గ్రామపెద్దలు పంతం చిన్న, పప్పొప్పు నాగేశ్వరరావు (పీఎస్) పంతం నాగేశ్వరరావు, రంగనీటి కట్లయ్య, ఓసూరి బాలనాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

28 బాటిళ్లతో ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణాలపై సోమవారం రాత్రి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ పి.హనుశ్రీ , సిబ్బంది దాడి చేశారు. ఆ వివరాలను హనుశ్రీ స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఆఫీసులో విలేకర్లకు వెల్లడించారు. నాలుగు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. బెల్ట్ షాపుల నిర్వాహకులు దూళిపాళ్ల కాశీ వెంకటరత్నం వద్ద 12, యంటపల్లి వెంకటేశ్వరరావు వద్ద 8, దెయ్యం అమ్మిరాజు వద్ద 8 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురినీ అరెస్ట్ చేశారు. అలాగే దుద్దుకూరులో దాడులు నిర్వహించి కోమటి పుల్లారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నాడు. బెల్ట్ దుకాణాల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని, విస్తృతంగా దాడులు నిర్వహించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని సీఐ హనుశ్రీ ఈ సందర్భంగా చెప్పారు. నిందితులకు స్టేషన్ బెయిల్ మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.

'బడి తర్వాత విద్యాబోధన' ప్రారంభం


నల్లజర్లలో 'బడి తర్వాత విద్యాబోధన' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పల్లి జ్యోతి

నల్లజర్ల: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నల్లజర్ల, పుల్లలపాడు గ్రామాల్లో 'బడి తర్వాత విద్యాబోధన' అనే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి ఆలస్యంగా ఇంటికి వస్తుంటారన్నారు. ఇలాంటి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందరినీ బడి తర్వాత ఒక చోట చేర్చి వలంటీర్లను నియమించి హోంవర్క్ చేయించడమే గాకుండా, వారితో చదివిస్తామన్నారు. అంతేగాకుండా విద్యార్థుల్లో విజ్ఞానం, ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలు చేపడతామన్నారు. బడి తర్వాత విద్యాబోధన కింద ఇప్పటికే 18 కేంద్రాల్లో 2,800 మంది విద్యార్థులకు ఈ తరహా బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇందుకోసం ఇరకాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనే సంస్థ తమకు తోడ్పాటు అందిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు కార్యక్రమానికి హాజరైన కోర కన్నయ్య రూ.10 వేలు, అల్లూరి హరిశ్చంద్ర ప్రసాద్ రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పుల్లలపాడు, నల్లజర్ల సర్పంచులు అల్లూరి సూర్యచంద్రరావు, పల్లి జ్యోతి, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, కార్యదర్శి కూరపాటి నాగరాజు, జీవీవీ ప్రసాద్, సీమకుర్తి ప్రసాద్, సవలం రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రక్కిలంక ర్యాంపు తెరిపించండి


ప్రక్కిలంక ఇసుక ర్యాంపు తెరవాలని అధికారులకు ఫిర్యాదు చేసి పడవ కార్మికులు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని గోదావరి ఇసుక ర్యాంపును తెరవాలని పడవ కార్మికులు కోరుతున్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో పడవ కార్మికులు ఈ మేరకు అర్జీ అందజేశారు. ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలపై ఆధారపడి 50 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. వారంతా గంగాలమ్మ, గండిపోశమ్మ పడవ కార్మిక సంఘాల పేరుతో రెండు సంఘాలుగా ఏర్పడ్డాయని వివరించారు. గోదావరి నదిలో ఇసుక తవ్వకం, రవాణా చేయడం ద్వారా ఈ కుటుంబాలన్నీ జీవనోపాధి పొందుతున్నాయన్నారు. అందువల్ల ప్రక్కిలంక ర్యాంపును తెరిచి, వాటి నిర్వహణ బాధ్యతను ఈ రెండు సొసైటీలకూ అప్పగించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సొసైటీల సభ్యులు పుష్పరాజు, దేవరపల్లి శ్రీను, అడ్డాల శ్రీను తదితరులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

శ్మశానవాటిక భూమిని అప్పగించాలని..

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న భూమిని హిందువుల శ్మశానవాటికకు అప్పగించాలని గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా రెవెన్యూ అధికారులకు ఆయన అర్జీ అందజేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలోని శివాలయం పక్కన సర్వే నంబర్ 528/2లో ఉన్న 1.73 ఎకరాల భూమిలో గతంలో హిందూ శ్మశానవాటిక ఉండేదన్నారు. ఆ భూమి అన్యాక్రాంతం కావడంతో హిందువులంతా దహన సంస్కారాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక భూమిని రీసర్వే చేసి హిందువులను మళ్లీ కేటాయించాలని సత్యనారాయణ కోరారు.

పీహెచ్‌సీ ఆవరణ పరిశుభ్రం


కానూరు పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది


పీహెచ్‌సీ ఆవరణలోని వ్యర్థాలను తగలబెడుతున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: 'ఆసుపత్రిలో అరకొర సౌకర్యాలు' శీర్షికన మండలంలోని కానూరు పీహెచ్‌సీ దుస్థితిపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఈ కథనం ప్రచురితం అయ్యాక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కానూరు పీహెచ్‌సీ సిబ్బంది హుటాహుటిన పరిసరాలను పరిశుభ్రం చేశారు. వ్యర్థాలను తగలబెట్టడమే గాకుండా ,ఆవరణ అంతా బ్లీచింగ్ చల్లారు. ఈ పీహెచ్‌సీ ఆవరణలో ఎక్కడికక్కడ వ్యర్థాలు పోగులు పడి ఉండడమే గాకుండా సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారులను వివరణ కోరారు. దానికి వారు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

గోపాలపురం: రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు పి. గిరిప్రసాద్ వర్మ అన్నారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉద్యోగ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఆవేదనలో ఉన్న సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగ సంఘాలు అండగా ఉంటాయన్నారు. అనంతరం ఉద్యోగుల సంఘ గోపాలపురం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కేఎల్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శిగా కేఎస్ రాజు సభ్యులుగా జ.మణికంఠ, శాంతి, సుప్రియ, కె వరలక్ష్మి ఎన్నికయ్యారు.

వైభవంగా గొంతెమ్మ ఊరేగింపు

నల్లజర్ల: మాలల ఆరాధ్య దైవమైన గొంతెమ్మ తల్లి ఊరేగింపు, నిమజ్జనోత్సవాన్ని నల్లజర్లలో సోమవారం వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సందడిగా సాగింది. ప్రత్యేక వాహనంపై గొంతెమ్మ మట్టి విగ్రహాన్ని ఉంచి పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. వీధుల్లో అమ్మవారికి భక్తులు పసుపు నీళ్లు ఓరపోసి ఆహ్వానించి కొబ్బరికాయలు, అరటి పండ్లు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గుదే వెంకట సుబ్బారావు, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు రాంబాబు, గారపాటి అనిల్, రాజశేఖర్, సత్యనారాయణ, వెంకట రామారావు, బొండల శ్రీనివాస్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మట్టి విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు.

పుష్కరాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- అజెండాలోని అన్ని అంశాలకు ఆమోదం


కొవ్వూరు మున్సిపల్ సమావేశానికి హాజరైన అధికార, విపక్షాల సభ్యులు

కొవ్వూరు: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. పుష్కరాలు సక్రమంగా నిర్వహించేందుకు పండితులు, మేధావుల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల విశిష్టతను తెలియజేసే బుక్‌లెట్‌ను పండితులతో తయారు చేయిస్తామన్నారు. పుష్కరాల నిర్వహణపై మంగళవారం రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. కొవ్వూరు పట్టణం నుంచి ఎలాంటి ప్రతి పాదనలు పంపాలో అధికారులు నివేదిక ఇవ్వాలని కోరారు. గోదావరి బండ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటి నుంచే అవసరమైన ప్రణాళికలు పంపాలని అధికారులకు సూచించారు. పశు వైద్యశాల వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సభ్యుడు కంఠమణి రమేష్‌బాబు సూచించారు. షార్ట్ ఫాల్స్ రెగ్యులర్ చేయాలని టౌన్ విభాగం అధికారులకు ఆయన సూచించారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఉన్న వాటిని క్లియర్ చేస్తున్నామని టీపీవో సమాధానం ఇచ్చారు.ప్రధాన అజెండాలోని 25 అంశాలను, అనుబంధ అజెండాలోని మూడు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

జీవిత బీమా ఏజెంట్ల ధర్నా

కొవ్వూరు: జీవిత బీమాసంస్థ (ఎల్ఐసీ) నూతన విధానాలను నిరసిస్తూ ఏజెంట్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరు బ్రాంచ్ ఆఫీసు ఎదుట ధర్నా చేశారు. పాత పాలసీ విధానాలు కొనసాగించాలని, జీఎస్టీని రద్దు చేయాలని, పాలసీలపై బోనస్ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కనీసం రూ.లక్ష పాలసీ కొనసాగించాలని, పాలసీ ప్రవేశ వయో పరిమితిని 55 ఏళ్లుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరం డివిజన్ ఏజెంట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మాధవరావు, కొవ్వూరు అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ కిషోర్, కార్యదర్శి ఎ.శ్రీనివాస్, పరిసర మండలాలకు చెందిన ఏజెంట్లు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయించవద్దు

దేవరపల్లి: రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయవద్దని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. దుకాణాల నిర్వాహకులు, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 13 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ఎస్సై కె. సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక ఎస్సై కె.నరేంద్ర సోమవారం పోలీసు స్టేషన్‌లో మండలంలోని బాణసంచా విక్రేతలు, తయారుదారులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సులు పొందిన వారు మాత్రమే నిర్దేశిత ప్రదేశాల్లో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ బాణసంచా విక్రయాలు, తయారీ సాగించాలన్నారు.

ఉండ్రాజవరం: టపాసుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాస్ దుకాణదారులను సోమవారం హెచ్చరించారు. తాత్కాలిక లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న బాణసంచా వ్యాపారులకు ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌లో ఆయన సూచనలు ఇచ్చారు.

30 పడకల ఆసుపత్రిగా నల్లజర్ల పీహెచ్‌సీ

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- సీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన


నల్లజర్ల సీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రి (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వెల్లడించారు. ఈ పీహెచ్‌సీ పక్కనే గల ఎరువుల గిడ్డంగులను తొలగించి అక్కడ సీహెచ్‌సీ నిర్మాణం చేసేందుకు సోమవారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో త్వరలోనే ఈ ఆసుపత్రి నిర్మాణం ప్రారంభించనున్నట్టు చెప్పారు. దీంతో పాటు ట్రామా కేర్ సెంటర్ నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టరు పద్మశ్రీ ఆసుపత్రి వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, డాక్టర్ గంగాధరరావు, డాక్టర్ సిరాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఆరు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం


అక్రమంగా వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కొవ్వూరు: వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వినియోగించినా, వాటిని అక్రమంగా నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత హెచ్చరించారు. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో కలసి సోమవారం ఆమె కొవ్వూరు పట్టణంలోని వివిధ హోటళ్లను తనిఖీ చేశారు. హోటల్ విజయవిహార్ సెంటర్లో వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న ఆరు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యాజమాని అంకోలు వీర వెంకట సత్యనారాయణపై నిత్యావసర వస్తువుల చట్టం–1955 ప్రకారం సెక్షన్ 6– ఎ కింద కేసు నమోదు చేసినట్టు స్నేహిత తెలిపారు. విజిలెన్స్ అధికారి మధుబాబు, నవీన్‌కుమార్, లోవరాజు, కిషోర్, సీఎస్ డీటీ సునీత పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామానికి చెందిన ఖండవల్లి కొండబాబు కిడ్నీలు, లివర్ పాడయ్యాయి. కొంతకాలంగా వైద్య ఖర్చుల కు, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న కొండబాబుకు మానవత సేవాసంస్థ మండలశాఖ అండగా నిలిచింది. మానవత సంస్థ తరఫున ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ రూ.6 వేలు, దాతలు మరో రూ. 3 వేలు సాయంగా సోమవారం అందజేశారు. సంఘ కార్యదర్శి సనపల రాజశేఖర్, అప్పన వీరహనుమంతరావు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

- సమస్యలపై గళమెత్తిన సభ్యులు
- అధికార పక్షంపై విరుచుకుపడిన టీడీపీ సభ్యుడు గారింకి నాగేశ్వరరావు
- అజెండాలోని 24 అంశాలకూ ఆమోదం


తీవ్ర వాదోపవాదాలు చేసుకుంటున్న టీడీపీ సభ్యుడు కారింకి, వైఎస్సార్ సీపీ సభ్యులు

నిడదవోలు: వార్డుల్లోని సమస్యలపై కౌన్సిల్ సభ్యులు గళ మెత్తారు. అజెండా విషయంలో విపక్ష కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, అధికార పక్ష కౌన్సిలర్ల మధ్య గంటసేపు తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. సమావేశం రసాభాసగా సాగింది. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. అజెండాలోని 24 అంశాలనూ కౌన్సిల్ ఆమోదించింది. ముందుగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ రూ.58.09 కోట్ల వ్యయంతో పట్టణానికి గోదావరి జలాలు అందించే పథకానికి డిసెంబర్ లోగా రీ టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు. రూ.ఐదు కోట్లతో జగనన్న కాలనీలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. మార్కెట్ నుంచి గణపతి సెంటర్ వరకూ రుడా నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రుడా నిధులు రూ. 3.10 కోట్లతో పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు చైర్మన్ చెప్పారు. పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను త్వరలోనే మొదలుపెడతామన్నారు.

అజెండాలో అంశాలు ఆమోదించాలి

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్ మాట్లాడుతూ వివిధ వార్డుల్లో ముఖ్యమైన పనులను అజెండాలో తీసుకురావాలని కమిషనర్‌ను ముందుగానే కోరమన్నారు. ఎందుకు తీసుకు రాలేదని ప్రశ్నించారు. దీనికి విపక్ష కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు అభ్యంతరం తెలిపారు. ముందుగా అజెండాలోని అంశాలు ఆమోదించాక మిగిలిన అంశాలపై చర్చించాలన్నారు. దీంతో వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, సభ్యులు రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్‌లతో పాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పైకి లేచి రూల్ పొజిషన్ చెప్పాలని కమిషనర్ కోరారు. ఈ దశలో విపక్ష కౌన్సిలర్ కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. తామంతా అధికారులను అడుగుతుంటే అడ్డుకోవడానికి మీరెవరు? అంటూ రతీదేవి నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర స్థాయికి వాదోపవాదాలు చేరుకున్నాయి. మళ్ళీ ప్రతిపక్ష కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై విరుచుకు పడ్డారు. గతంలో తాను మాట్లాడుతున్నపుడు అజెండా పూర్తయ్యాక మాట్లాడే అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అందరికీ ఒకే రూల్ వర్తిస్తుందన్నారు. చైర్మన్ ఆదినారాయణ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ మొత్తం 19 వార్డుల్లో 38 పనులను అజెండాలో చేర్చాలని వైఎస్సార్ సీపీ సభ్యులు కోరారన్నారు. ప్రాధాన్యతా క్రమంలో చైర్మన్ ఆదినారాయణ అనుమతితో వివిధ పనులను అజెండాలో ప్రతిపాదించామని చెప్పారు. వచ్చే కౌన్సిల్లో ఆ పనులకు అంచనాలు తయారు చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వివరణ ఇచ్చారు.

ఈ–ఆటోలను ఎందుకు వాడడం లేదు?

పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెత్త సేకరణకు ఇచ్చిన ఆరు ఈ–ఆటోలను ఎందుకు వినియోగించడం లేదని కౌన్సిలర్ రతీదేవి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో ఐదు వార్డుల ప్రజలు ఏడాదిగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆమె అధికారును నిలదీశారు. మున్సిపల్ డీఈ డి.సత్యనారాయణ సమాధానమిస్తూ పట్టణంలో 30 ఏళ్ల క్రితం వేసిన పైప్ లైన్లు శిథిలావస్థకు చేరడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో ట్యాంకుల ద్వారా మంచి నీరు సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. మున్సిపల్ ఏఈ హేమంత్ మాట్లాడుతూ చెత్త సేకరణకు వినియోగించే ఈ–ఆటోలు మరమ్మతులు చేయిస్తామన్నారు.